




www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

బుధవారం | 28 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08






# సేవే బలం ప్రజలే బలగం




**సేవల్లో మేటి ఉదయ్‌కు సాటెవ్వరు**

**సేవే పరమావధిగా ఉదయ్ కిరణ్**

**సేవారత్న ఉదయ్ జోష్**

**ప్రజా సేవ నుంచి పబ్లిక్ లీడర్‌గా**

**మియాపూర్ గడ్డపై యువనేత ఉదయ్ కిరణ్ జోష్!**

**చర్చంతా ఉదయ్ పైనే**

**మియాపూర్, అక్షిత ప్రతినిధి :** సేవే బలం... ప్రజలే అతనికి కొండంత బలగం. సేవల్లో మేటి.. ఉదయ్ కిరణ్ కు రారు సాటెవ్వరు. ఆపదలో ఆపన్న హస్తం. పేదల కష్టాల్లో తోడుగా... యువతకు స్ఫూర్తిగా.. మియాపూర్ ప్రజల గుండెల్లో.. యలమంచి ఉదయ్ కిరణ్ చెరగని ముద్ర. ప్రజా జీవితంలో నాయకత్వానికి అసలైన కొలమానం పదవి కాదు. ప్రజలతో ఉన్న అనుబంధం, సమస్యలపై స్పందించే తత్వం, పరిష్కారం కోసం చేసే నిరంతర కృషి. ఈ మూడు అంశాలను పునాదులుగా చేసుకుని ..మిగతా 2లో

## పక్కాగా ఓటరు నమోదు

**అర్హులెవరు మిస్ కావొద్దు**

**రాష్ట్ర కళాశాల, సాంకేతిక విద్య కమిషనర్ శ్రీ దేవసేన**



**నల్గొండ, అక్షిత ప్రతినిధి :** అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర చాలా ముఖ్యమని నల్గొండ జిల్లా ..మిగతా 2లో

## పకడ్బందీగా భూ సర్వే

**పనితీరు మార్చు రాకపోతే కఠిన చర్యలు**

**భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదు**

**పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి**

**పేదల సొంతింటి కలకు సాకారం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

2



# పకడ్బందీగా భూ సర్వే

## పనితీరు మార్చు రాకపోతే కఠిన చర్యలు

## భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదు

## క్షేత్రస్థాయిలో సర్వేను పరిశీలించి రైతులకు భూమి విస్తీర్ణంపై స్పష్టత ఇవ్వాలి

## పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

## పేదల సొంతింటి కలకు సాకారం

## రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఉమ్మడి మెదక్, అక్షిత బ్యూరో :** రెవెన్యూ ఉద్యోగులు సక్రమంగా, బాధ్యతా యుతంగా పనిచేసినప్పుడే ప్రజల ముఖ్యంగా రైతుల సమస్యలు తీరుతాయని ఈ విషయంలో ఇప్పటికే పలుమార్లు రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించినప్పటికీ పూర్తిస్థాయి ఫలితాలు కనిపించలేదని భవిష్యత్తులో మార్పురాకపోతే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిహెచ్చరించారు. మంగళవారం నాడు ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖల పనితీరుపై సంగారెడ్డి జిల్లా పరిషత్ మీటింగ్ హాలు లో ఉమ్మడి

జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి లతో కలిసిమంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందన్నారు. భూ సర్వే నిర్వహణకు సంబంధించి పలువురు తహసీల్దార్లు, సర్వేయర్లతో ముఖాముఖి నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే కోసం ఎన్ని గ్రామాలను కేటాయించారు, ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తయింది, ఏ విధంగా సర్వే నిర్వహిస్తున్నారు, రోజుకు ఎన్ని ఎకరాల భూమిని సర్వే చేస్తున్నారు, సర్వే పూర్తి చేయడానికి ఎంత సమయం పడుతోంది తదితర అంశాలపై ఆరా తీశారు. సర్వే సమయంలో సంబంధిత రైతుకు తన భూమి ఎంత విస్తీర్ణంలో ఉందో స్పష్టంగా తెలియజేయాలని తహసీల్దార్లు, సర్వేయర్లకు సూచించారు. భూమి విస్తీర్ణం, సరిహద్దులకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రైతులకు ఎలాంటి సందేహాలు లేకుండా వివరించాలని పేర్కొన్నారు. తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు రెవెన్యూ అధికారులు సర్వే ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తూ, రైతుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాదీ ఆస్తుల రీ సర్వేను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందని, రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సూచించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారమయ్యే వరకు విడతలవారీగా ఇళ్ల మంజూరు కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై నిర్మాణ వ్యయ భారాన్ని తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం

అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు వేగవంతంగా, పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సమీక్షకు ముందు పలువురు ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో నెలకొన్న భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత జిల్లా కలెక్టర్లకు మంత్రి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలోసి సి ఎల్ ఎ కమీషనర్ లోకేష్ కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్,ఎంపీ రఘునందన్ రావు, సురేశ్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, సంజీవరెడ్డి ,సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, హైమావతి, ప్రతిమా సింగ్‌లతో పాటు అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సేవే బలం ప్రజలే బలగం



**మొదటి పేజీ తరువాయి...**

మియాపూర్ ప్రాంతంలో సామాజిక సేవ నుంచి రాజకీయాల వరకు తనదైన శైలిలో యలమంచి ఉదయ్ కిరణ్ ప్రజలకు చేరువయ్యారు.చేసే సేవలతోనే ప్రజా బలగం మిన్నగా ఉంది. నలుగురు కూడిన చోట చర్చంతా ఉదయ్ కిరణ్ పైనే. పేదోళ్ళకు చేరువగా ఉంటూ అన్ని వర్గాల ప్రజలకు ఆసరాగా నిలిచే ఉదయ్ కిరణ్ కు మియాపూర్ కార్పొరేటర్ పట్టం కట్టేందుకు ప్రజలు సంసిద్ధులయ్యారు.మియాపూర్, మక్తా మహబూబ్ పేట్, మయూరి నగర్ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిత్వ చర్చల్లో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు యలమంచి ఉదయ్ కిరణ్. ప్రజా సేవలో నిరంతర భాగస్వామ్యం, పార్టీ సంస్థాగత కార్యక్రమాల్లో క్రియాశీలక పాత్ర, స్థానిక సమస్యలపై అవగాహన, యువతతో అనుబంధం, డిజిటల్ వేదికలపై బలమైన ప్రస్థానం ఆయన రాజకీయ ప్రయాణానికి ప్రత్యేకతను తీసుకొచ్చాయి. మానవ సేవే మాధవ సేవ అనే భావనను నినాదంగా కాకుండా కార్యాచరణగా మలుచుకున్న ఉదయ్ కిరణ్, తన పేరు మీద ఉన్న చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, పేదల సంక్షేమం, యువత, క్రీడలు, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టారు. చలివేంద్రాల ఏర్పాటు, ఉచిత వైద్య శిబిరాలు, కంటి వైద్య శిబిరాలు, ఉచిత మందుల పంపిణీ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, వృద్ధాశ్రమాల్లో సేవలు, అనాథాశ్రమాల్లో అన్నదానం, దివ్యాంగుల సంక్షేమం, పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువుల పంపిణీ, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాల ద్వారా అవసరమైన వర్గాలకు అండగా నిలిచారు. భారీ వర్షాలు, తీవ్ర వేడి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో అత్యవసర సహాయక చర్యల్లో భాగస్వామ్యం కావడం, పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి సన్మానించడం ఆయన సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

సాంకేతిక విద్యలో బంగారు పతకం సాధించిన ఉదయ్ కిరణ్ విద్యను వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సామాజిక మార్పుకు పునాదిగా భావిస్తున్నారు. పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులకు ఫీజుల సహాయం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, నోట్ పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ వంటి కార్యక్రమాలతో విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నారు. అదే సమయంలో యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు క్రికెట్, బ్యాడ్మింటన్ టోర్నీల నిర్వహణ, క్రీడా సామగ్రి పంపిణీ వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.మియాపూర్, మక్తా మహబూబ్ పేట్, మయూరి నగర్ ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాలువలు, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, ట్రాఫిక్ వంటి అంశాలను ప్రజల నుంచి తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, పరిష్కారం వరకు పర్యవేక్షించడం ఆయన కార్యాచరణలో భాగంగా ఉంది. సామాజిక సేవతో పాటు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత కార్యక్రమాల్లోనూ ఉదయ్ కిరణ్ చురుకుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు, బూత్ స్థాయి కార్యకలాపాలు, ఎన్నికల నిర్వహణ, ఇంటింటి ప్రచారం, ఓటరు అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పర్యవేక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంలో ఆయన భాగస్వామ్యం కొనసాగుతోంది. శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ నాయకత్వంలో నిర్వహించే పార్టీ మరియు ప్రజా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, స్థానిక కార్యకర్తలు మరియు యువతను కలుపుకొని ముందుకు సాగుతున్నారు.

### డిజిటల్ వేదికపై ప్రత్యేక గుర్తింపు

ఆధునిక రాజకీయాల్లో ప్రజలతో అనుసంధానానికి డిజిటల్ వేదికలు కీలకంగా మారిన నేపథ్యంలో, సామాజిక మాధ్యమాలను ప్రజా కార్యక్రమాల సమాచారాన్ని విస్తృతంగా చేరవేసే వేదికగా ఉదయ్ కిరణ్ సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. అరవై వేలకు పైగా అనుచరులతో శేరిలింగంపల్లి రాజకీయ వర్గాల్లో సామాజిక మాధ్యమాల పరంగా గణనీయమైన ప్రజా పరిచయాన్ని ఏర్పరుచుకున్నారు.

### సేవకు లభించిన గుర్తింపులు

సామాజిక సేవా రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా గౌరవ డాక్టరేట్, సేవా రత్న జాతీయ పురస్కారం, ప్రెస్ వింగ్స్ క్లబ్ ఉత్తమ పురస్కారం, సేవా రత్న పురస్కారంతో పాటు పలు సామాజిక, విద్యా, సేవా సంస్థల నుంచి ప్రశంసా పత్రాలు, సన్మానాలు అందుకున్నారు.సేవతో సంపాదించిన పేరు, ప్రజలతో నిర్మించిన అనుబంధం, క్షేత్రస్థాయిలో సాధించిన అనుభవం, నాయకత్వంపై పెరుగుతున్న అంచనాలతో మియాపూర్, మక్తా మహబూబ్ పేట్, మయూరి నగర్ రాజకీయ పరిధిలో యువ నాయకత్వంపై చర్చ పెరుగుతున్న వేళ, యలమంచి ఉదయ్ కిరణ్ పేరు రాజకీయంగా మరింత ప్రాధాన్యత సంతరించుకుంటోంది.

# పక్కాగా ఓటరు నమోదు



**మొదటి పేజీ తరువాయి...**

ఓటరు జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర కళాశాల, సాంకేతిక విద్య కమిషనర్ శ్రీ దేవసేన అన్నారు. మంగళవారం ఆమె నల్గొండ జిల్లా, చండూరు ఆర్డీవో మరియు మునుగోడు ఈఆర్ఓ కార్యాలయంలో మునుగోడు నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్ ప్రక్రియ పై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సర్ ప్రక్రియ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడంలో అధికారులతో పాటు, రాజకీయ పార్టీల పాత్ర ముఖ్యమని అన్నారు. సర్ ప్రక్రియలో అధికారులతో కలిసి పని చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కోరారు. ఇందులో భాగంగా ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం సర్ ఫారాలపై వచ్చిన అభ్యంతరాలను నవంబర్ 5 వరకు పరిష్కరించేందుకు అవకాశం ఉందని, ఇంకా ఎక్కడైనా అర్హులైన వారు ఓటరుగా నమోదుకు అవకాశం ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు అలాంటి వారందరిని గుర్తించి ఓటరుగా నమోదు అయ్యేలా చూడాలని చెప్పారు. అర్హులు ఏ ఒక్కరు ఓటరు జాబితా నుండి తప్పిపోకూడదన్నారు.రాజకీయ పార్టీలు ఇంకా ఎక్కడైనా బిఎల్ఏలను నియమించకుంటే వెంటనే నియమించాలని కోరారు. రాబోయే వారం రోజులు సర్ ప్రక్రియలో అర్హులైన వారందరూ ఓటరుగా నమోదయ్యేలా పక్కాగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ఆమె ప్రతివారం నిర్వహించే రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశానికి హాజరవుతున్నారా? ఓటరు జాబితాలో చనిపోయిన, తొలగించిన వారి పేర్లను చూసుకున్నారా? లేదా అని అడిగి రాజకీయ పార్టీల ప్రతినిధులను తెలుసుకున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలో సర్ ప్రక్రియ పకడ్బందీగా జరిగిందని, ప్రతివారం క్రమం తప్పకుండా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలు నిర్వహించారని,సర్ పై తమకు వచ్చిన సందేహాలన్నింటిని ఈ ఆర్ ఓ,ఆర్డిఓ ఎప్పటికప్పుడు తీర్చారని, సర్ ప్రక్రియలో ఈఆర్వో,ఏఈఆర్ఓ లందరు బాగా కృషి చేశారని అభినందించారు.

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా మునుగోడు నియోజకవర్గానికి సంబంధించి అన్ని హియరింగ్స్ ను పూర్తి చేయడం జరిగిందని, వచ్చిన ఫారం 6 ,7, 7 ఏ పరిశీలించామని,అన్ కలెక్టెడ్ ఫారాలన్నింటిని బిఎల్ఏ ల సమక్షంలో పరిశీలించడం జరిగిందని, ఫారం 6,7,8 లపై వచ్చిన అభ్యంతరాలను నవంబర్ 5 న పరిష్కరించేందుకు చివరి తేదీగా ఈసీ నిర్ణయించడం జరిగిందని, నవంబర్ 9న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు . మిగిలిపోయిన అభ్యంతరాలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని ఓటరు జాబితా పరిశీలకురాలికి వివరించారు. అనంతరం ఓటరు జాబితా పరిశీలకురాలు జిల్లాలోని ఈఆర్వోలు, ఏఈఆర్ఓలతో సర్ ప్రక్రియపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ఫారం 6,7,7ఏ,8లను వివిధ స్థాయిలలో చేసిన తనిఖీ, ఆక్సిలరీ పోలింగ్ స్టేషన్ల అవసరం ,ఆన్లైన్లో ఎప్పటికప్పుడు ఓటరు జాబితా సవరణ, తదితర అంశాలపై సమీక్షించారు. అలాగే వివిధ పారాలపై వచ్చిన అభ్యంతరాలపై ఏర్పాటు చేసిన హియరింగ్స్ కు ఓటర్లకు సరైన సమయం ఇచ్చింది లేనిది అడిగి తెలుసుకున్నారు. సర్ ప్రక్రియకు సంబంధించి రికార్డులన్నింటినీ జాగ్రత్తగా నిర్వహించాలని,బిఎల్ఓ యాప్ లో అన్ని వివరాలు నమోదు అయ్యేలా చూడాలని , రెండు చోట్ల నమోదైన ఓటర్ల వివరాలను మరోసారి తనిఖీ చేయాలని, ఫోటో ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక సర్ ప్రక్రియ మొత్తం పూర్తి జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడ తప్పులు జరగకుండా చూసుకోవాలని, పూర్తి పారదర్శకంగా చేయాలని, సర్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండాలన్నదే ఎన్నికల సంఘం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,ఈ ఆర్ ఓ దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి, నల్గొండ ఈఆర్వో ,ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, మిర్యాలగూడ ఈఆర్ఓ ,ఆర్డిఓ రమణారెడ్డి, చండూర్ ఆర్డిఓ మరియు మునుగోడు ఈఆర్వో శ్రీదేవి, ఆయా నియోజకవర్గాల ఏఈఆర్ఓలు, తహసిల్దార్లు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# ప్రస్తుత పంటను అన్ని విధాలా కాపాడాలి

**యాసంగిలో వరి సాగు చేయవద్దు**

**రాష్ట్ర వ్యవసాయ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**కరువు పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి**

**వచ్చే ఏడాది జూలై వరకు త్రాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు**

**నీటి సంరక్షణ పనులు విస్తృతంగా చేపట్టాలి**



ఖమ్మం/అక్షిత బ్యూరో : ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత వానాకాలం పంటను అన్ని విధాలా కాపాడాలని రాబోయే యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత శాఖల అధికారులతో ఎల్‌నినో పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా నీటి పారుదల మిషన్ భగీరథ వ్యవసాయం భూగర్భ జలాలు మార్కెటింగ్ విద్యుత్ వైద్యారోగ్య శాఖల అధికారులు తమ శాఖల ప్రస్తుత పరిస్థితులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కరువు పరిస్థితులు మండలాల వారీగా భూగర్భ జలాలు తగ్గుతున్న తీరుపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని అన్నారు. ఈ నెలాఖరు నాటికి, వచ్చే నెలలో భూగర్భ జలాల పరిస్థితి ఎలా ఉండబోతుందనే అంచనాలను ప్రజలకు వివరించాలని అధికారులు ఎప్పటికప్పుడు మీడియా సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

ప్రస్తుతం రైతులు ఎంతో కష్టపడి సాగు చేస్తున్న వానాకాలం పంటను కాపాడేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెండవ పంట సాగు చేస్తే రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని ఈ విషయాన్ని రైతులకు స్పష్టంగా వివరించాలని సూచించారు.

రాబోయే యాసంగి సీజన్‌లో సాగునీటి లభ్యత ఉండే అవకాశం లేదని మంత్రి తెలిపారు. రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు దూరంగా ఉండాలని పప్పుధాన్యాలు చిరు ధాన్యాలు కూరగాయలు ఇతర తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని, రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉద్యాన పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బిందు సేద్యం ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు.

రెండవ పంటకు సంబంధించి స్థానిక పరిస్థితులను బట్టి తక్కువ నీటితో పండే పంటలకు తడులు అందించే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. ఎక్కడా పంట వ్యర్థాలను తగులబెట్టకుండా చూడాలని పంట వ్యర్థాలు తగులబెట్టిన ఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. కిన్నెరసాని నీటిని యాసంగి పంటలకు విడుదల చేయవద్దని అవసరమైతే మిషన్ భగీరథ త్రాగునీటి అవసరాలకు వినియోగించాలని ఆదేశించారు.

నాగార్జునసాగర్ పరిధిలోని రెగ్యులేటర్లు షట్టర్లు పంపిణీ వ్యవస్థలను మూసివేసే పాలేరు వరకు ప్రధాన కాలువల్లో నీటిని నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువలో మూడు పంప్‌హౌస్‌లను వినియోగించి సాధ్యమైనంత ఎక్కువ నీటిని నిల్వ చేయాలని తెలిపారు.

పాలేరు రిజర్వాయర్ మూడు జిల్లాల త్రాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా నీటి నిల్వలను సమర్థంగా నిర్వహించాలని అన్నారు. దుమ్ముగూడెం టెయిల్‌పాండ్ సమీపంలో ఇసుక బస్తాలతో అడ్డుకట్టను పెంచి సుమారు 1 టీఎంసీ నీటిని నిల్వ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ ఏడాది నీటి ఆవిరి నష్టాలు ఇంకుడు నష్టాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సమయాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నియంత్రించాలని పైపులైన్ల లో లీకేజీలను అరికట్టి నీరు వృధా కాకుండా చూడాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూలై వరకు త్రాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.

ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లాలో 10 మండలాల్లో తీవ్ర కరువు 7 మండలాల్లో సాధారణ కరువు పరిస్థితులు ఉన్నాయని వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే భూగర్భ జలమట్టాలు సుమారు 2 మీటర్లు తగ్గిపోయాయని పేర్కొన్నారు. కామేపల్లి మధిర ఏన్కూరు సత్తుపల్లి ఎర్రుపాలెం మండలాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయని ఆయా ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలు కూడా ఉన్నాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా లంకాసాగర్ జలాశయాలను నింపుకోవడంతో పాటు నాగార్జునసాగర్ ఆయకట్టుకు కొంతమేర సాగునీరు అందించగలిగామని వివరించారు. రాబోయే యాసంగి సీజన్‌కు సాగునీరు అందుబాటులో లేదని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. మధిర ఏన్కూరు తదితర నాలుగు మండలాల్లో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదిక పంపామని అవసరమైన పశుగ్రాసాన్ని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా కొంత ఉపశమనం లభించిందని వివరించారు.

ఈ సమావేశంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా అదనపు కలెక్టర్ పి శ్రీనివాస రెడ్డి ఉమ్మడి జిల్లా వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన సదస్సు

**740 మంది విద్యార్థులకు బాలల హక్కులు, వ్యక్తిగత భద్రతపై అవగాహన**




రామన్నపేట అక్షిత ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ,తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, బచ్‌పన్ బచావో ఆందోళన్ కార్యక్రమంలో భాగంగా "కానూన్ జానో -- బచ్‌పన్ బచావో" (చట్టాన్ని తెలుసుకోండి -- బాల్యాన్ని కాపాడండి) అనే అంశంపై రామన్నపేట పట్టణం కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామన్నపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ శ్రీమతి వి. రత్నకుమారి హాజరై సుమారు 740 మంది విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలు, వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులు మంచి స్పర్శ--చెడు స్పర్శ (గుడ్ టచ్--బ్యాడ్ టచ్) మధ్య తేడాను గుర్తించాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, లైంగిక వేధింపుల నివారణ వంటి ముఖ్యమైన అంశాలను వివరించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినపుడు భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వెంటనే తెలియజేయాలని, అవసరమైనప్పుడు న్యాయ సహాయం పొందాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి బాలుడు, బాలిక తమ హక్కుల గురించి తెలుసుకొని, ఎలాంటి భయం లేకుండా సురక్షిత వాతావరణంలో విద్యను అభ్యసించాలని ఆమె పేర్కొన్నారు. బాలలపై జరిగే నేరాలను అరికట్టడంలో విద్యార్థులకు అవగాహన కల్పించడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్లు కునూరు శ్రీనివాస్, మామిడి వెంకట్ రెడ్డి, అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యుడు కె. శ్రీశైలం, పారా లీగల్ వాలంటీర్ కె. యాదయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్, కరస్పాండెంట్ జి. నరేందర్, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్త కొండ జానకి, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొమరం భీమ్ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**సిరిచెల్మలో ఘనంగా వర్ధంతి వేడుకలు**





ఇచ్చోడ అక్షిత న్యూస్: ఆదివాసీల హక్కులు, ఆత్మ గౌరవం, అటవీ భూములపై హక్కుల సాధన కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తి దాయకమని సిరి చెల్మ గ్రామం ఆదివాసీ సంఘం నాయకులు అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఆది వాసీ సమాజం విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక అభివృద్ధి రంగా ల్లో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. మండలంలోని సిరిచెల్మ గ్రామంలో మంగళవారం కొమరం భీం 86 వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొమరం భీమ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించా రు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ కాళ్ల రవీంద ర్, సింగు పటేల్, గణపతి శిఖరం, రాము కృష్ణ పటేల్ బైరీ లచ్చన్న, శివయ్య, చిన్నయ్య ఆదివాసీ యువకు లు గ్రామస్తులు తది తరులు పాల్గొన్నారు.

## జిడబ్ల్యూఎంసీ 63 డివిజన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**63వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ శ్రీ సయ్యద్ రజాలి**



కాజీపేట్, అక్షిత ప్రతినిధి : హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 63వ డివిజన్ లోని రేషన్ షాప్ ల వద్ద ప్రజా ప్రభుత్వం జారీచేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌర సరఫరాలు, భారీ నీటిపారుదల శాఖ మాత్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు 63వ డివిజన్ లో రేషన్ షాప్ ల వద్ద ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు.ఎలినో ప్రభావం ఉన్నందున డివిజన్ ప్రజలు నిత్యవసర సరుకులు విద్యుత్ వినియోగం మంచినీటి పొదుపు చేయాలని రానున్న రోజుల్లో కరువు రాబోతున్న దృష్ట ప్రజలు అప్రమత్తంగా ఉండి వాలా జాగ్రత్తగా నిత్యవసర వస్తువులను వినియోగించుకోవాలని 63వ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ శ్రీ సయ్యద్ రజాలి సూచించారు.ఈ నెల నుండి స్మార్ట్ కార్డులు తీసుకున్న వారికి బియ్యంతో పాటు తొమ్మిది నిత్యవసరల సరుకులు పంపిణీ చేయడం జరుగుతుంది.కావున ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ మహమ్మద్ షబ్బీర్ తబ్బు, మాజీ కార్పొరేటర్ గుంటి కుమార్, మైనార్టీ నాయకులు మహ్మద్ షాకీర్,62వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్న 12 నెంబర్ రేషన్ షాప్ డీలర్ మొహమ్మద్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# పంటల మార్పిడి అలవర్చుకోవాలి

### ఖేతి బచావో అభియాన్‌పై అవగాహనలో ఎడిఎ జగదీష్ రెడ్డి






**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** ఎల్ నీనో ప్రభావం దృష్ట్యా పంటల మార్పిడి అలవార్చుకోవాలని మిర్యాలగూడ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె. జగదీష్ రెడ్డి కోరారు. మంగళవారం మిర్యాలగూడ మండలంలోని కొత్తగూడెం రైతు వేదికలో నిర్వహించిన ప్రత్యేక రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్పిఓలు), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పాక్స్), మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థికంగా ఎదగడానికి ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా సంబంధిత సంఘాల సభ్యులు వివిధ ఆర్థిక అవకాశాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, రైతు సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి రైతులకు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. ఖేతి బచావో అభియాన్‌లో భాగంగా పంటల మార్పిడిపై అవగాహన యాసంగి సీజన్‌లో వరి పంట సాగుకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలైన పెసర్లు, మినుములు, నువ్వులు, వేరుశనగ, ఇతర పప్పుధాన్యాలు, కూరగాయలు తదితర పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. ఈ అంశంపై గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని, డిసెంబర్ 15వరకు కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలన్నారు.

రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందేలా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును 100 శాతం పూర్తి చేయడానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.

రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, పంటల మార్పిడి, రైతు సంఘాల ఆర్థిక బలోపేతం లక్ష్యంగా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అవగాహనలో మండల వ్యవసాయఅధికారి మేకల ఋషేంద్రమణి, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, నూకల వేణుగోపాల్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సర్పంచ్ పిసికె.ప్రసాద్, రైతులు జే. మోహన్ రెడ్డి, నాగిరెడ్డి, నర్సింహారెడ్డి, మిర్యాలగూడ, ఆలగడప పాక్స్ సిఇఓలు సతీష్, పి.నాగయ్య, ఐకెపి సీసీ ప్రవీణ్ రెడ్డి, ఐలాపూర్, కిష్టాపూర్ ఎఫ్పిఓ వెంకన్న, రవి, ఎస్.వెంకటపాల్ రెడ్డి, ఎఇఓలు ఎం. రమేష్, ఎన్.నాగయ్య, ఆర్. పార్వతీలు పాల్గొన్నారు.

## క్యాన్సర్ చికిత్సలో యశోద హాస్పిటల్స్ కీలక ముందడుగు

### హైటెక్ సిటీలో అత్యాధునిక ఎన్‌జీఎస్ సాంకేతికత ప్రారంభం



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** క్యాన్సర్‌ను ముందస్తుగా కచ్చితంగా గుర్తించి రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్‌జీఎస్) సదుపాయాన్ని ప్రారంభించినట్లు మెడికల్ ఆంకాలజిస్ట్ యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ డాక్టర్ లక్ష్మారెడ్డి మేకల తెలిపారు.ఖమ్మం యశోద మెడికల్ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంప్రదాయ చికిత్సలకు భిన్నంగా రోగి జన్యు మార్పులను గుర్తించి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స అందించేందుకు ఈ సాంకేతికత దోహదపడుతుందన్నారు ఊపిరితిత్తులు రొమ్ము జీర్ణాశయ సంబంధిత క్యాన్సర్లతో పాటు ఇతర క్యాన్సర్ల చికిత్సలోనూ ఎన్‌జీఎస్ పరీక్షలు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఆసుపత్రిలోనే ఈ పరీక్షలు అందుబాటులో ఉండటంతో వేగంగా కచ్చితంగా ఫలితాలు తెలుసుకొని తగిన చికిత్సను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. లక్ష్యిత చికిత్సలు ఇమ్యూనోథెరపీ వంటి ఆధునిక విధానాలు క్యాన్సర్ రోగుల జీవనకాలం జీవన నాణ్యతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు.రోబోటిక్ ఆంకోసర్జరీ అధునాతన రేడియేషన్ థెరపీతో పాటు సమగ్ర క్యాన్సర్ వైద్య సేవలను యశోద హాస్పిటల్స్ అందిస్తోందన్నారు. అత్యాధునిక సాంకేతికతతో రోగి కేంద్రిత వైద్య సేవలను మరింత విస్తరించడమే లక్ష్యమని అన్నారు.ఈ సమావేశంలో యశోద హాస్పిటల్ మేనేజర్లు బాలరాజు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

### సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి గిరిజ తిరందాసు..



**తాండూరు అక్షిత ప్రతినిధి:** తాండూరు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తాండూరు ప్రభుత్వ నంబర్-1 పాఠశాలలో సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాండూరు జూనియర్ సివిల్ జడ్జి గిరిజ తిరందాసు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జడ్జి గిరిజ తిరందాసు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సూచించారు. బాలల హక్కులను కాపాడటం, వారికి సురక్షితమైన వాతా వరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలలు ఎదుర్కొనే సమస్యలు, వారి రక్షణకు ఉన్న చట్టాలు, హక్కుల గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోక్సో చట్టం, విద్యా హక్కు చట్టం, బాల్యవివాహాల నిర్మూలన, బాలల హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలలపై జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, సూచించారు. చట్టాలపై అవగాహన పెంపొం దించుకోవడం ద్వారా బాలల హక్కులను పరిరక్షించు కోవచ్చని, వివరించారు.

ఈ కార్యక్రమంలో తాండూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పాశం రవికుమార్, ప్యానెల్ న్యాయవాదులు జిలాని, టీ. అరుణ, ఏ. పరమేశ్వరి, మస్తాన్, దేవ్‌రాజ్, ఇతర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు.

## అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం

### పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలి

### నవంబర్ 1న రాంలీలాలో జరిగే మైదాన్ మహా సభ ను జయప్రదం చేయండి

### అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** పట్టభద్రులు తమ ఓటు ను నమోదు చేసుకోవాలని అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్ సూచించారు. మంగళవారం అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్ ఆధ్వర్యంలో అలియాబాద్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమం, నవంబర్ 1న ఢిల్లీ లోని రాంలీలా మైదాన్ మహా సభ పై చర్చించారు. ఈ సందర్భంగా తుంకి రమేష్ మాట్లాడుతూ ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నవంబర్ 1న జరగబోయే ఓటు బచావో - దేశ్ బచావో మహా ర్యాలీ తో పాటు నిర్వహించే సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా రంగారెడ్డి - హైదరాబాద్ - మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కోసం ప్రతి వార్డులో వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జీలు, పార్టీ నాయకులు ఇంటింటికి తిరిగి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని తీర్మానించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ ముద్దం సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సరసం అశోక్ రెడ్డి, నాయకులు కోడూరి దినేష్, బండరి బాబు, తంటం రాము, ఊరడి వెంకటేష్, చాట్లపల్లి నర్సింగరావు, ముద్దం వీరారెడ్డి, ధర్మారెడ్డి, సంఘమైన కుమార్ యాదవ్, మణికొండ నవీన్, కుడుముల వెంకటేష్, దొండ మనోహర్, వీరన్నగారి భూపాల్, చిటుకుల రాజశేఖర్ రెడ్డి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభం




**ఖమ్మం/అక్షిత బ్యూరో :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో వరంగల్--నల్గొండ-- ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఖమ్మంలో ప్రారంభించారు.

ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మూడు జిల్లాల కోఆర్డినేటర్ సయ్యద్ ఇస్మాయిల్ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ అనిత చౌదరి ముఖ్య అతిథులుగా హాజరై ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ నాయకురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న విద్యావంతుడు ఉద్యమకారుడు నలమాస శ్రీకాంత్ గౌడ్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సామాజిక న్యాయం తెలంగాణ రాష్ట్ర హక్కుల పరిరక్షణ అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం లక్ష్యంగా పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లాలని నాయకులు సూచించారు. ఆదివాసీ గిరిజన బిడ్డలతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం చదువుకున్న వారికి ఉద్యోగాలు మెరుగైన జీవనోపాధి అవకాశాలు అందరికీ నాణ్యమైన వైద్యం రైతులకు మెరుగైన సహకారం చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా అణగారిన వర్గాల బిడ్డలకు న్యాయం జరగాలంటే సామాజిక న్యాయమే మార్గమని పేర్కొన్నారు. పట్టభద్రులు ఓటరు నమోదుపై అవగాహన పెంచుకుని అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరభద్రం వనం నాగేందర్ కర్లపూడి రఫీ హరీఫ్ రాజ్ కుమార్ తాళ్లూరు సైదులు సద్గుర్తి మురళీకృష్ణ హుస్సేన్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# చేతులు, కాళ్లలో తిమ్మిరా?

# నిర్లక్ష్యం చేయకండి!

**వెన్నుపాముపై ఒత్తిడిని పట్టించుకోకపోతే శాశ్వత వైకల్యం ముప్పు!**

**అత్యాధునిక పద్ధతులతో మరింత సులభతరమైన వెన్నెముక శస్త్రచికిత్సలు**

**సకాలంలో చికిత్సతో త్వరగా కోలుకునే అవకాశాలు**

**రంగా రెడ్డి,అక్షిత బ్యూరో:** చేతులు, కాళ్లలో తిమ్మిరి, చొక్కా గుండీలు పెట్టుకోవడంలో ఇబ్బంది, చేతి పట్టు తగ్గడం, నడవడంలో సమస్యలు మెడ భాగంలోని వెన్నుపాముపై ఒత్తిడికి సూచనలు కావచ్చు. ఇటువంటి సమస్యలతో రోజువారీ పనులు చేసుకోవడంలో ఇబ్బంది పడుతున్న హైదరాబాద్‌లోని జిల్లెల్‌గూడకు చెందిన 36 ఏళ్ల బడుకల రాముకు మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు వెన్నుపాముపై ఒత్తిడిని తొలగించి, మెడ వెన్నెముకకు స్థిరత్వం కల్పించే శస్త్రచికిత్స నిర్వహించారు. రాము రెండు చేతులు, రెండు కాళ్లలో తిమ్మిరితో ఆసుపత్రికి వచ్చారు. ఎడమవైపుతో పోలిస్తే కుడివైపు సమస్య ఎక్కువగా ఉంది. నొప్పి లేకపోయినా చొక్కా గుండీలు పెట్టుకోవడం, ముఖం కడుక్కోవడం, వస్తువులను పట్టుకోవడం, నడవడం వంటి పనుల్లో ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఎంఆర్ఐ పరీక్షలో సీ3–సీ4 స్థాయిలో డిస్క్ ఉబ్బడం, స్పైనల్ కెనాల్ సన్నబడటం, వెన్నుపాముపై ఒత్తిడితో పాటు ఫోకల్ మైలోమలేసియా ఉన్నట్లు గుర్తించారు. సీ5–సీ6 స్థాయిలో కుడివైపు డిస్క్ భాగం బయటకు చొచ్చుకురావడం వల్ల వెన్నుపాముపై ఒత్తిడి ఏర్పడినట్లు కూడా నిర్ధారించారు. సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డా. శ్రీనివాస్ బొట్ల రోగిని సమగ్రంగా పరీక్షించి, వెన్నుపాముపై ఒత్తిడిని తొలగించడంతో పాటు మెడ వెన్నెముకకు స్థిరత్వం కల్పించేందుకు శస్త్రచికిత్సను ప్రణాళిక చేశారు.



రోజువారీ పనులకు ఆటంకంగా మారిన వెన్నుపాముపై ఒత్తిడి

తదుపరి పరీక్షలు, చికిత్స కోసం రాము ఆసుపత్రిలో చేరారు. గతంలో 50 కిలోల బియ్యం బస్తాలతో సహా అధిక బరువులు ఎత్తినట్లు తెలిపారు. అయితే ప్రమాదం, గాయం జరిగిన చరిత్ర లేదు. వైద్య పరీక్షలో ముఖ్యంగా కుడిచేతి పట్టు తగ్గినట్లు నమోదైంది. పరీక్షల్లో మెడ వెన్నెముకలో పలు స్థాయుల్లో వెన్నుపాముపై ఒత్తిడి ఉన్నట్లు గుర్తించారు. వెన్నుపాము కణజాలంలో మార్పులను సూచించే ఫోకల్ మైలోమలేసియా కూడా కనిపించింది.

**చికిత్సలో ప్రధానంగా**

రెండు చేతులు, రెండు కాళ్లలో తిమ్మిరికి వైద్య పరీక్షలు

చేతుల పనితీరు, పట్టు, నడకలో ఇబ్బందుల అంచనా

ఫోకల్ మైలోమలేసియా నిర్ధారణ సీ3 నుంచి సీ6 వరకు సర్వైకల్ లామినెక్టమీ

టైటానియం స్క్రూలతో లేటరల్ మాస్ ఫిక్సేషన్

రాడ్లతో పెడికల్ స్క్రూ ఫిక్సేషన్, బోన్ గ్రాఫ్ట్ ప్లేస్‌మెంట్

శస్త్రచికిత్స అనంతరం పాటించాల్సిన జీవనశైలి మార్పులపై ముందస్తు వివరణ

శస్త్రచికిత్స అనంతరం ఐసీయూ పర్యవేక్షణ, ఫిజియోథెరపీ

ఎంఆర్ఐ ద్వారా మెడ భాగంలో స్పైనల్ కెనాల్ సన్నబడటం, వెన్నుపాముపై ఒత్తిడి గుర్తింపు

లక్షణాల్లో గణనీయమైన ఉపశమనం, స్థిరమైన ఆరోగ్య పరిస్థితితో డిశ్చార్జ్

**వైద్యుల అభిప్రాయం**

"ఈ రోగి రెండు చేతులు, రెండు కాళ్లలో తిమ్మిరితో పాటు చొక్కా గుండీలు పెట్టుకోవడం, వస్తువులను పట్టుకోవడం, నడవడం వంటి రోజువారీ పనుల్లో ఇబ్బందులతో వచ్చారు. ఎంఆర్ఐలో మెడ భాగంలో స్పైనల్ కెనాల్ సన్నబడటం, వెన్నుపాముపై ఒత్తిడితో పాటు ఫోకల్ మైలోమలేసియా కనిపించాయి. వెన్నుపాములో ఇప్పటికే ఉన్న మార్పుల నేపథ్యంలో జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని రోగికి, కుటుంబ సభ్యులకు వివరించాం. సీ3 నుంచి సీ6 వరకు సర్వైకల్ డీకంప్రెషన్, ఫిక్సేషన్‌తో పాటు బోన్ గ్రాఫ్ట్ ప్లేస్‌మెంట్ నిర్వహించాం. శస్త్రచికిత్స అనంతర కాలం ఎలాంటి సమస్యలు లేకుండా సాగింది. డిశ్చార్జ్‌కు ముందు లక్షణాలు గణనీయంగా తగ్గినట్లు రోగి తెలిపారు. పునరావాస చికిత్స, తదుపరి వైద్య పర్యవేక్షణ కొనసాగించడం ముఖ్యమైనది."

– డా. శ్రీనివాస్ బొట్ల, ఎంఎస్, ఎంసీహెచ్ (న్యూరో), ఎఫ్ఎస్ఎఫ్ఎన్, సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్,

యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్‌పేట్

**యశోదా ఆసుపత్రి యాజమాన్యం స్పందన**

న్యూరోసర్జరీ వైద్య బృందం, అనస్తీషియా నిపుణులు, శస్త్రచికిత్స అనంతర సంరక్షణ బృందం, ఫిజియోథెరపిస్టుల సమన్వయంతో రోగికి చికిత్స అందించినట్లు మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. చేతులు, కాళ్లలో తిమ్మిరి, చేతి పట్టు తగ్గడం, నడవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు రోజువారీ పనులకు ఆటంకం కలిగిస్తున్నప్పుడు నిర్లక్ష్యం చేయకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు. శస్త్రచికిత్స అనంతరం పునరావాస చికిత్స, అవసరమైన జాగ్రత్తలు, నిర్ణీత సమయంలో పునఃపరీక్షల విషయంలో వైద్య బృందం సూచనలను పాటించడం ముఖ్యమని పేర్కొన్నారు.

## త్యాగాలను స్మరిస్తూ సైకిల్ ర్యాలీ



**వరంగల్, అక్షిత బ్యూరో:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా, ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సైకిల్ ర్యాలీ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకునే సందేశాన్ని చాటింది. హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, ఎన్ పి డిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ట్రై సిటీ లోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి సేవలను ఎప్పటికీ మరువకూడదని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీ వారికి అంకితమైన ఘనమైన నివాళి అని తెలిపారు. సైక్లింగ్ వంటి శారీరక వ్యాయామాలు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సైకిల్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించిన ఏఆర్ అదనపు డీసీపీలు వి.శ్రీనివాస్, సురేష్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ లను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, హనుమకొండ ఏసీపీ నర్సింహరావు, సీఐలు, ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, నగరంలోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు సుమారు 200 మంది పాల్గొన్నారు.

## నీటిని వృథా చేయకండి..

**ప్రతి నీటి బొట్టును పొదుపు చేయండి**

**ఎన్కెపల్లి గ్రామ సర్పంచ్ తూంపల్లి దయాకర్ విజ్ఞప్తి**




**పూడూర్, అక్షిత ప్రతినిధి:** నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించాలని పూడూర్ మండలం ఎన్కెపల్లి గ్రామ సర్పంచ్ తూంపల్లి దయాకర్ మంగళవారం నాడు గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్కెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నీరు జీవకోటికి ఆధారమని, తాగునీటిని వృథా చేయకుండా అవసరమైనంత మాత్రమే వినియోగించాలని సూచించారు.

ఇళ్లలో కుళాయిలు తెరిచి ఉంచడం, నీటి ట్యాంకులు నిండిన తర్వాత కూడా మోటార్లు నడపడం వంటి చర్యలతో నీరు వృథా అవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణపై బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా ఉండాలంటే ఇప్పటి నుంచే నీటిని పొదుపు చేయాలని, గ్రామ ప్రజలందరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని సర్పంచ్ తూంపల్లి దయాకర్ విజ్ఞప్తి చేశారు.

# రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ

**సీపీ గౌష్ ఆలం**

**పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం**





**కరీంనగర్ అక్షిత బ్యూరో:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ ఆదేశాల మేరకు మంగళవారం కరీంనగర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, మానవతా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ అని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను రక్షించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రక్తదానానికి కులం, మతం, ప్రాంతం, లింగభేదాలతో సంబంధం లేదని, ఇది మానవత్వానికి, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని సీపీ పేర్కొన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందించడం ఎంతో కీలకమని తెలిపారు. రక్తదానం చేసే ముందు వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అనంతరం వైద్యుల సూచనల మేరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బంది సేవలను స్మరించుకుంటామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు 47 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారని, వారి త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలను గౌరవించడం, వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లో నిర్వహించిన శిబిరంలో 150 మంది రక్తదానం చేశారు. ఈ రక్తదాన కార్యక్రమశీలో ఏసీపీ లు శ్రీనివాస్, శ్రీనివాస్ జి, వెంకటస్వామి, విజయకుమార్, స్వామి పాల్గొన్నారు. అంతేకాకుండా శిబిరానికి సహకరించిన ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి, ఆర్ఎంఓ, వైద్య బృందానికి, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారందరికీ పోలీస్ శాఖ తరఫున సీపీ కృతజ్ఞతలు తెలిపారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
బుధవారం |28| అక్టోబర్| 2026

## పోలీస్ అమరవీరుల సంస్మరణలో బాగంగా రక్తదానం

### సిపి శ్వేత



**వరంగల్, అక్షిత బ్యూరో:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో రక్తదాన శిబిరం. రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో 101 యూనిట్ల రక్తం సేకరణ స్వయంగా రక్తదానం చేసిన పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత,ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అదనపు డీసీపీలు సురేష్, వి. శ్రీనివాస్, ఏసీపీలు మధుసూదన్, నరసింహారావు, సత్యనారాయణ, ఏఆర్ ఏసీపీలు నాగయ్య,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తదానం ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం

### సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత



**వరంగల్, అక్షిత బ్యూరో:** విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు సిబ్బందినీ స్మరిస్తూ వరంగల్ పరిధిలోని మట్టేవాడ, ఇంతజార్గంజీ, మీల్స్ కాలనీ, పోలీస్ స్టేషన్లో పరిధి పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో వరంగల్ లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెంట్రల్ జోన్ డిసిపి ధారా కవిత, హనుమకొండ ఏసిపి నరసింహారావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల స్మారకార్థం వారిని స్మరిస్తూ పోలీసు ఉద్యోగం రక్షణ కోసమే కాదు ప్రజల సేవ కోసం ఇతర కార్యక్రమాల్లో కూడా పోలీస్ సిబ్బంది ముందు ఉంటారని తెలియజేసేందుకు సామాజిక బాధ్యతగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అనేకమంది పోలీస్ సిబ్బంది కుటుంబాలు బాధపడుతున్న ప్రజల కోసం పోలీసులు ఎప్పుడు సేవ చేసేందుకు ముందుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తో పాటు ఇన్స్పెక్టర్లు శుకుర్, కరుణాకర్, తో పాటు మూడు పోలీస్ స్టేషన్ల సిబ్బంది, స్థానిక మాజీ కార్పొరేటర్ బసవరాజు కుమారస్వామి, ప్రముఖులు రక్తదానం చేశారు. చిప్ప వెంకటేశ్వర్లు, యువత పెద్ద ఎత్తున పాల్గొని స్వచ్ఛంద రక్తదానంలో పాల్గొన్నారు.

## నూతన సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్ పట్టణ పోలీస్ స్టేషన్ నూతన సీఐ గా డి సతీష్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచుల ఫోరమ్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గిర్కటి నిరంజన్ గౌడ్,ఉపసర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి చిన్నం బాలరాజు కురుమ, బిఆర్టియు జిల్లా అధ్యక్షులు ఢిల్లీ మాధవ రెడ్డి,యాదవ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండె బోయిన అయోధ్య యాదవ్, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అల్మాస్ పేట కృష్ణ , చిట్టంపల్లి సాయి, శ్రీకాంత్ లు సీఐ డి. సతీష్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## రైతు నేస్తం ద్వారా ఆధునిక సాగు పద్ధతులపై రైతులు

# అవగాహన పెంచుకోవాలి

### ఇంద్రకల్‌లో 112వ రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** డిసెంబర్ నెలాఖరులోగా 550 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్, నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న 550 పడకల ఆసుపత్రి పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ మంగళవారం సందర్శించి క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా నిర్మాణ పనులు ఏ మేరకు పూర్తయ్యాయి, ఇంకా ఎలాంటి పనులు చేపట్టాల్సి ఉంది, నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి అనే అంశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. మిగిలి ఉన్న పనులను గుర్తించి, వాటిని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ మాట్లాడుతూ....., నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న 550 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను రానున్న డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రభుత్వం నిర్దేశించిన నమూనా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉపయోగించే సామగ్రి నాణ్యతతో పాటు పనుల ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేయడమే కాకుండా, భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆసుపత్రి నిర్మాణం నాణ్యతతో ఉండాలని సూచించారు.

నిర్మాణంలో మిగిలి ఉన్న పనులను గుర్తించి, వాటి పూర్తికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను సకాలంలో పరిష్కరించుకోవాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, పనులను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసేలా బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎండి సులేమాన్, ఇంజనీరింగ్ అధికారి సుధాకర్ రెడ్డి, ఇతర మెడికల్ కళాశాల అధికారులు తదితరులు ఉన్నారు.

## తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి

### బీఆర్ఎస్ విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నాం

### డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేశ్

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** తెలంగాణ రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై దృష్టి సారించడం శుభపరిణామమని కరీంనగర్ డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేశ్ అన్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ ప్రతినిధి బృందంతో కలిసి మహారాష్ట్రకు వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో ప్రాజెక్టు నిర్మాణంపై చర్చలు జరపడం హర్షణీయమని పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌లో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**"ఉమ్మడి ఆదిలాబాద్ రైతులకు ప్రయోజనం"**

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం పూర్తయితే తెలంగాణతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి అవసరాలు తీరేందుకు దోహదపడుతుందని అనంతుల రమేశ్ తెలిపారు. ఈ ప్రాజెక్టుపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, సాగునీటి సౌకర్యం మెరుగుపడితే వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. మహారాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం ఆశాజనకమన్నారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన చర్చలు సఫలమై ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బ్యారేజీ ఎత్తు 150 మీటర్లకు సంబంధించి కూడా చర్చలు జరుగుతున్నట్లు తెలిపారు.

**"పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు"**

గత పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు తుమ్మిడిహట్టి బ్యారేజీ విషయంలో ఆశించిన స్థాయిలో ముందడుగు వేయలేదని అనంతుల రమేశ్ విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మహారాష్ట్రతో చర్చలు జరుపుతుంటే విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రాజెక్టు నిర్మాణంపై చిత్తశుద్ధితో పనిచేయకుండా, ప్రస్తుతం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వెటకారం చేయడం వారి రాజకీయ వైఖరిని తెలియజేస్తోందని వ్యాఖ్యానించారు.



రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రెండేళ్లలోనే మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండటాన్ని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణం ముందుకు సాగితే తమ రాజకీయ ఉనికికి ఇబ్బంది కలుగుతుందనే భయంతోనే విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గ్రావిటీ ద్వారా నీరు అందుబాటులోకి వస్తే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యం తగ్గుతుందనే భయంతోనే బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని అనంతుల రమేశ్ అన్నారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ విమర్శలకే వారు ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు, రైతులు బీఆర్ఎస్ నాయకులపై విశ్వాసం కోల్పోయారని, అందుకే గత ఎన్నికల్లో ఆ పార్టీని అధికారానికి దూరం చేశారని వ్యాఖ్యానించారు.

**"రైతుల ప్రయోజనాలే ముఖ్యం"**

రైతులకు సాగునీరు అందించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని అనంతుల రమేశ్ సూచించారు. కరువు పరిస్థితులు రావాలని కోరుకోవడం కాకుండా, వాటిని ఎదుర్కొనేందుకు సమష్టిగా కృషి చేయాలని అన్నారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతుందనే నమ్మకం తమకు ఉందని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అందరూ సహకరించాలని కోరారు.

# నిత్యం రద్దీగా రాజీవ్ బైపాస్....

### అయినా రోడ్డు విస్తరణలో జాప్యం...

### మెలికలు తిరిగిన రోడ్డుతో ప్రమాదాలకు ఆస్కారం..?

### గొల్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద తరచూ ట్రాఫిక్ సమస్యలు....?

### స్థానిక ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టిసరించాలి



**అక్షిత జగిత్యాల ప్రతినిధి:** జగిత్యాల పట్టణంలో విపరీతంగా రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రోడ్లపై ట్రాఫిక్ భారీగా ఉంటుంది.. కొన్ని సందర్భాలలో యాక్సిడెంట్స్ కూడా జరుగుతున్నాయి.

ముఖ్యంగా కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండ్ వరకు వెళ్లే దారి అంతా కూడా ఎప్పుడు చూసినా నిత్యం రద్దీగా ఉంటుంది.. దానికి ప్రత్యామ్నాయంగా గతంలోనే జగిత్యాల పట్టణంలోని చిన్న కెనాల్ చౌరస్తా నుండి గొల్లపల్లి క్రాస్ రోడ్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగింది.

అందువల్ల కొంతలో కొంత ట్రాఫిక్ సమస్యలు తగ్గిపోయాయని చెప్పవచ్చు.. అయినా కూడా గొల్లపల్లి క్రాస్ రోడ్ నుండి తిప్పన్నపేట చౌరస్తా వరకు ఉన్న రోడ్డు విస్తరణ పనులు ఇంకా ప్రారంభించలేదు.. గతంలో గొల్లపల్లి క్రాస్ రోడ్డు వరకు మాత్రమే విస్తరించడం అప్పటి రద్దీ దృష్ట్యా అధికారులకు మరియు ప్రజాప్రతినిధులకు అది



సరైన నిర్ణయమే... కానీ ప్రస్తుతం గొల్లపల్లి క్రాస్ రోడ్ నుండి ఉన్న మిగతా రాజీవ్ బైపాస్ రోడ్డు అనేక మలుపులు తిరిగి ఉన్న ఆ రోడ్డు నిత్యం రద్దీగా ఉండటమే కాకుండా తరచూ ప్రమాదాలకు నిలయంగా మారుతుంది... ఆ రోడ్డు వెంటే ప్రవేట్ పాఠశాలలు, ఆసుపత్రి సముదాయాలు, ఒక బార్ అండ్ రెస్టారెంట్ మరియు వాణిజ్య సముదాయాలు నెలకొని ఉన్నాయి.. అందువలన రాను రాను ఆ రోడ్డు జనాలతో రద్దీ గా ఉంటుంది.. దానికి తోడు రోడ్డు పూర్తిగా మలుపులు తిరిగి ఉండటం వలన దగ్గరికి వచ్చే వరకు కూడా ఎవరికి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం వలన ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంది..

**మెలికలు తిరిగిన రోడ్డు....?**

ఈ రోడ్డు అంతా కూడా మెలికలు తిరిగి ఉండటం వలన చాలా దగ్గరికి వచ్చే వరకు కూడా భారీ వాహనాలు కనబడే ఆస్కారం లేదు. కొంచెం వేగంగా ఉన్న ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొనే అవకాశం ఉంది.. అంతేకాకుండా రెండు పెద్ద వాహనాలు ఒకేసారి ఆ రోడ్డుపై ఎదురెదురు పడితే మెలికలు తిరిగి ఉండటం వలన వాహనాలు ముందుకెళ్లడం కష్టంగా ఉంది..

**గొల్లపల్లి క్రాస్ రోడ్ వద్ద తరచు ట్రాఫిక్ సమస్యలు..**

దాదాపు మూడు పాఠశాలలు ఈ రోడ్డుని అనుకొని ఉండటం వలన మరియు భారీ వాహనాలు ఈ రోడ్డు వెంటే ధర్మపురివైపు ప్రయాణించడం వలన గొల్లపల్లి క్రాస్ రోడ్ చౌరస్తా వద్ద ఎప్పుడు చూసినా ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది..

**ఆ రోడ్డు విస్తరణలో జాప్యం ఎందుకు..?**

గొల్లపల్లి క్రాస్ రోడ్ నుండి తిప్పనపేట చౌరస్తా వరకు ఉన్న మిగతా రాజీవ్ బైపాస్ రోడ్ విస్తరణకు ఎలాంటి అడ్డంకులు కూడా లేకపోవడం ఇక్కడ గమనించాల్సిన అంశం.. ఎందుకంటే ఆ రోడ్డు వెంట విస్తరిస్తున్న కాలనీ అంతా కూడా ఎప్పటికైనా రోడ్డు విస్తరణ కచ్చితంగా జరుగుతుందని భావించి సెట్ బ్యాక్ అయి ఇళ్ల నిర్మాణం చేపట్టారు.. ఎలాంటి నష్టపరిహారాలు కానీ భూసేకరణ సంబంధిత సమస్యలు కానీ ఉత్పన్నమయ్యే అవకాశం చాలా తక్కువ..

**ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టిసారించాలి..**

జగిత్యాల పట్టణానికి నలువైపులా కొత్త రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ రోడ్డు విస్తరణ పై స్థానిక ఎమ్మెల్యే మరియు ఇతర ప్రజాప్రతినిధులు దృష్టిసరించి రోడ్డు విస్తరణ చేసినట్లయితే పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలు పూర్తిగా తగ్గిపోవడమే కాకుండా భారీ వాహనాలు వెళ్లేందుకు చాలా అనుకూలంగా ఉంటుంది.. కావున వెంటనే ఈ రోడ్డు విస్తరణ పనులు మొదలుపెట్టాలని స్థానిక కాలనీ వాసులు మరియు పట్టణ ప్రజలు కోరుతున్నారు

## విద్యార్థులను పత్తి చేలకు తరలించరాదు

### వివిధ శాఖల అధికారులు వాహనాలు తనిఖీ చేసి12 మంది పిల్లలకు విముక్తి

### హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** విద్యార్థులను పత్తి చేలకు తరలించవద్దని లింగాల హెడ్ కానిస్టేబుల్ అన్నారు. మంగళవారం లింగాల మండల పరిధిలోని మధుపూర్, అచ్చంపేట కొత్తగుంటపల్లి చౌరస్తాలో పత్తి తీసేందుకు పిల్లలను తరలిస్తున్న వారిని విద్యాశాఖ, పోలీస్ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, కోనేరు స్వచ్ఛంద సంస్థ , చైల్డ్ హెల్ప్ లైన్1098 ల సంయుక్తంగా మంగళవారం ఉదయం8.00 లకు వాహనాలను నిలుపుదల చేసి12 మంది పిల్లలకు విముక్తి కల్పించడం జరిగింది. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు . తిరిగి పాఠశాలలకు పంపించడం జరిగింది. వాహనాలలో కెపాసిటీ కన్నా ఎక్కువ తరలించరాదరి సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ, కానిస్టేబుళ్లు బాల్రాజ్, రాజేందర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మల్లేష్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రమీల, విద్యాశాఖ సిఆర్పి హరిలాల్, కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్లు జాకీర్ హుస్సేన్ శ్రీనివాసులు శివుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంబసీ,సంచార జాతి లకే ఎంఎల్సి అవకాశం కల్పించాలి



**వరంగల్ , అక్షిత బ్యూరో :** గవర్నర్ కోటాలో ఎంఎల్ సి గా బీసీలలో ఉన్న చిన్న కులాలకి అవకాశం కల్పించాలని బిసి జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినారు.ఎన్నికలలో పోటీ చేసి గెలిచే స్తోమత లేని కులాలకి, ఇప్పటివరకు చట్టసభలలో ప్రాతినిధ్యం దక్కని కులాలకు నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యత కల్పించినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినారు.గవర్నర్ కోటాలో పదవీకాలం ముగిస్తున్న ఎం ఎల్ సి లలో ఒకరు ఎం బి సి ల నుండి ప్రాతినిధ్య వహిస్తున్న వారే కాబట్టి ఆ స్థానంలో మరలా ఎంబీసీలకే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినారు. కాంగ్రెస్ పార్టీ లాంటి జాతీయ పార్టీ కూడా చిన్న కులాలను, క్రింది కులాలను పట్టించుకోకపోతే ఎవరు పట్టించుకుంటారని ప్రశ్నించారు.

బి సి లలో మొదటి ఐదు సామాజిక వర్గాలు 24.9 శాతం ఉంటే సంచార జాతులు అత్యంత వెనుకబడిన వర్గాలు 31.1 శాతం ఉన్నారు కాబట్టి నామినేటెడ్ పదవులలో సంచార జాతులకి ఎంబిసి లకి ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేసినారు. గవర్నర్ కోటాలో ఖాళీ అవుతున్న మూడు ఎం ఎల్ సి లలో ఒకటి బిసి లకి మరొకటి ఎంబీసీ లకి లేదా సంచార జాతులకు కేటాయించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినారు.

## ఏలినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

### నీర్నెముల గ్రామసభలో సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి పిలుపు

### నీటి పొదుపు, విద్యుత్ పొదుపుపై ప్రత్యేక దృష్టి.. ఎనిమిది నెలల కార్యాచరణ ప్రణాళికకు ఆమోదం

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** ఏలినో ప్రభావంతో రాబోయే రోజుల్లో ఎదురయ్యే కరువు, నీటి ఎద్దడి, పంట నష్టాలు, విద్యుత్ కొరతను అధిగమించేందుకు గ్రామస్థులు ఇప్పటి నుంచే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నీర్నెముల గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. రామన్నపేట మండలం నీర్నెముల గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన ఏలినో ప్రభావం వల్ల కలిగే నష్టాలపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. రాబోయే ఎనిమిది నెలల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై ఈ సందర్భంగా విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు, విద్యుత్‌ను పొదుపుగా వాడాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించేందుకు గ్రామస్థులంతా సమష్టిగా కృషి చేయాలని కోరారు.

**మునగ సాగుతో రైతులకు ప్రయోజనం**



వ్యవసాయ అధికారి ఎజాజ్ అలీ ఖాన్ మాట్లాడుతూ తక్కువ నీటితో సాగు చేయగల మునగ పంటను ప్రత్యామ్నాయ పంటగా ప్రోత్సహించాలని సూచించారు. మునగ ఆకుల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని, రైతులు ఈ పంట సాగుపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

**ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపు**

వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టేందుకు ప్రతి ఇంటి వద్ద, వ్యవసాయ పొలాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆశిష్ రాఘవ, ఏపీఓ వెంకన్న సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలమట్టాలను పెంచుకోవచ్చని వివరించారు.

**నీరు, విద్యుత్ పొదుపు అందరి బాధ్యత**

తాగునీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్‌ఈఓ గోపాల్ సూచించారు. వ్యవసాయంలో డ్రిప్, స్ప్రింక్లర్ వంటి నీటి పొదుపు పద్ధతులను వినియోగించుకోవాలని తెలిపారు. ఎండల తీవ్రత సమయంలో వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనవసర విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని, సాధ్యమైనంత వరకు పగటిపూట విద్యుత్ మోటార్ల వినియోగాన్ని తగ్గించేందుకు రైతులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వరరావు, లైన్‌మెన్ నవీన్ కోరారు. ఎండ తీవ్రత వల్ల మనుషులు, పశువులకు కలిగే నష్టాలు, వడదెబ్బ నివారణ చర్యలపై వెటర్నరీ అసిస్టెంట్ రఘు, హెచ్‌ఎం రవి అవగాహన కల్పించారు. ఈ గ్రామసభలో ఎంపీఓ ఎండీ రఫీ, డిప్యూటీ తహసీల్దార్ శైలజ, ఏపీఓ వెంకన్న, జీపీఓ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మిరియాల లక్ష్మి, వార్డు సభ్యులు ముత్యాల కిషన్, పెరుమాండ్ల నవీన్, బోయిని ఐలమ్మ, కట్ట సాత్విక, వీబీకే ముత్యాల రాణి, అంగన్‌వాడీ టీచర్లు మంగమ్మ, సౌజన్య, మాజీ ఉపసర్పంచ్ చల్ల సత్య ప్రకాష్, నాయకులు నోముల విష్ణు, బోయిని మల్లేష్, పంచాయతీ సిబ్బంది ముత్యాల సాయిలు, చిన్నపాక రాంబాబు, నోముల శంకర్, నోముల యాదయ్య, చిప్పలపల్లి పద్మ, వీఆర్‌ఏ చల్ల ముత్యాలు, పాల సంఘం చైర్మన్ ఆవుల సైదమ్మతో పాటు గ్రామస్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాబోయే ఎనిమిది నెలల్లో ఏలినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలతో రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను గ్రామసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

## సింగరేణి ఉద్యోగులకు పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు



**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** సింగరేణి మందమర్రి ఏరియాలో ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కోసం మంగళవారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో సీనియారిటీ ప్రాతిపదికన కౌన్సెలింగ్ నిర్వహించారు.మొత్తం 142 క్వార్టర్లు అందుబాటులో ఉండగా, 149 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల మేరకు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి 38 మంది అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, కే. శ్యామ్‌కుమార్ (ఈఈ--ఐఈ), మేనేజ్‌మెంట్ ట్రైనీ (సివిల్) ఆర్. వీణ, పర్సనల్ డిపార్ట్‌మెంట్ ఓఎస్ రాజలింగు, సంబంధిత శాఖ సిబ్బంది పాల్గొని కేటాయింపు ప్రక్రియను పర్యవేక్షించారు.

## నేటి మొక్కలే.. రేపటి ప్రాణ వాయువులు

**జిల్లా అటవీశాఖ అధికారి కె.దామోదర్ రెడ్డి**



**సూర్యాపేట, అక్షిత బ్యూరో :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా అటవీశాఖ అధికారి కె.దామోదర్ రెడ్డి అన్నారు.మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యమన్నారు.అక్షర ఫౌండేషన్ సూర్యాపేట ఆధ్వర్యంలో వేద కిడ్నీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్,ఆభరణ జ్యువెలర్స్ ల సహకారంతో కుడకుడ లోని జిఎంఆర్ టౌన్ షిప్ లో ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమాన్ని జిల్లా అటవీశాఖ అధికారి కె.దామోదర్ రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మొరిశెట్టి లక్ష్యాదిలతో కలసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు,వాతావరణ మార్పులు,వర్షపాతంలో అనిశ్చితి వంటి సమస్యలను ఎదుర్కోవడానికి పచ్చదనం పెంపొందించాలని సూచించారు. ఎల్ నినో వంటి వాతావరణ పరిణామాలు రుతుపవనాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.ఈ హరితహారం కార్యక్రమంలో మామిడి, సపోటా,కొబ్బరి,నిమ్మ,రావి, మర్రి,విప్ప,కానుగు,పండ్ల మొక్కలు,పూల మొక్కలు,షో మొక్కలు,నీడ చెట్లు మొదలగునవి 600 మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ అధ్యక్ష,కార్యదర్శులు రుద్రంగి కాళిదాస్,నరాల తిరుమల రెడ్డి,కౌన్సిలర్ గుణగంటి సతీష్,చింతరెడ్డి రామలింగా రెడ్డి,ఉప్పు నాగయ్య,బత్తుల దామోదర్ రెడ్డి,కె.నారాయణ రెడ్డి,భాస్కర్ రెడ్డి,షేక్ నజీర్ భాష,గౌరిశెట్టి అప్పారావు,చామకూరి కిరణ్, దేవరకొండ సాయికుమార్,గడ్డం వీరబాబు,జటంగి ముత్తయ్య, అక్షరా ఫౌండేషన్,టౌన్ షిప్ సభ్యులు పాల్గొన్నారు.

# ఓటు బచావో-దేశ్ బచావో ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**అర్హులైన ప్రతి ఓటరుకు హక్కు దక్కాలి.. కాంగ్రెస్ నేతల పిలుపు**

**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు 'ఓటు బచావో--దేశ్ బచావో' ఉద్యమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఏఐసీసీ అబ్జర్వర్ కేబీఆర్ నాయుడు పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో భూపాలపల్లి లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ అబ్జర్వర్ కేబీఆర్ నాయుడు, టీపీసీసీ సమన్వయకర్త అరికెల నర్సారెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. రెండో దశలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాలు, డివిజన్లలో సమావేశాలు నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్లకు (బీఎల్ఏలకు) ఓటర్ల జాబితా పరిశీలనపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి బూత్‌లో ఇంటింటి పరిశీలన చేపట్టి జాబితాలో పేర్లు లేని వారు, తప్పులు ఉన్నవారు, పొరపాటున మరణించినట్లు లేదా ఇతర ప్రాంతాలకు మారినట్లు నమోదైన వారి వివరాలను సేకరించాలని సూచించారు. గ్రామసభల ద్వారా ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు..

ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేయించేందుకు ప్రజలకు సహకరించాలని కార్యకర్తలకు సూచించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓటు బచావో--దేశ్ బచావో' మహా ర్యాలీని విజయవంతం చేసేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, పలువురు కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, మహిళా కాంగ్రెస్, ఎస్టీ సెల్, సేవాదళ్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి

**చట్టానికి లోబడి నడుచు కోవడమే అమరవీరులకు మనం ఇచ్చే గౌరవం**

**బైక్ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న యువత,పట్టణ ప్రజలు**



**సూర్యాపేట, అక్షిత బ్యూరో :** పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ కె. నరసింహ ఆధ్వర్యంలో ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఖమ్మం చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ పీఎస్ఆర్ సెంటర్, కల్నల్ సంతోష్‌బాబు చౌరస్తా, కోర్టు చౌరస్తా మీదుగా ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల చౌరస్తా వరకు కొనసాగింది.ఈ ర్యాలీలో పట్టణ ప్రజలు, యువత,పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.జిల్లా ఎస్పీ నరసింహ పోలీసు అధికారులతో కలిసి ఖమ్మం చౌరస్తా వద్ద బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల చౌరస్తా వద్దకు చేరుకున్న అనంతరం పౌరులతో కలిసి "జై జవాన్.. జై కిసాన్.. జై పోలీస్" అంటూ నినాదాలు చేశారు.పోలీసు అమరవీరుల ఆశయాలను సాధిస్తామని ప్రతిజ్ఞ చేస్తూ అమరుల స్మారకార్థం ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు,చేస్తున్న కఠిన సేవలను ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.దేశం,ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి అమరులైన పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు.పోలీసు అమరవీరులకు గౌరవం ఇవ్వాలంటే ప్రతి పౌరుడు సత్ప్రవర్తనతో మెలుగుతూ చట్టానికి లోబడి నడుచుకోవాలని ఎస్పీ సూచించారు.అమరవీరుల త్యాగాలను నిరంతరం స్మరించుకుంటూ,వారి సేవలను ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయంగా నిలిపేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి,ఆర్మ్‌డ్ డీఎస్పీ నరసింహా చారి,సీఐలు రాజశేఖర్,వెంకటయ్య, రామారావు,శివకుమార్, ఆర్ఐలు నారాయణ రాజు, ప్రవీణ్ కుమార్,జానయ్య, ఆర్ఎస్ఐ సురేష్,ఎస్ఐలు సందీప్,సాయిరాం,మహేష్, రహీముద్దీన్,కనకరత్నం, పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్,కార్యదర్శి కిరణ్, యువత,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బాలల అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

**సమాజం లోని అన్ని వర్గాలు ప్రభుత్వ శాఖలు,స్వచ్ఛంద సంస్థలు సమన్వయం తో కృషి చేయాలి**






**వరంగల్, అక్షిత బ్యూరో:** మంగళవారం ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సుబేదారిలోని అసంతా భవన్ లో బాలల అక్రమ రవాణా నిర్మూలన పైన ఎన్జీవో,ఇతర సంస్థల ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన నిర్వహించడం నిర్వహించారు .

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిడబ్ల్యూసి చైర్ పర్సన్ వసుధ మాట్లాడుతూ సమాజంలో ఇంకా బాలలు అక్రమ రవాణాకు గురవుతున్నారని పోలీసు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఇతర ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు దీని నివారణకు కలిసి పని చేసిన కూడా ఇంకా అక్రమ రవాణాను అరికట్ట లేకుండా ఉన్నామని జిల్లాలో బాలల అక్రమ రవాణా ,మానవ అక్రమ రవాణా నిర్మూలన కొరకు స్వచ్ఛంద సంస్థలు కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు

ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులతో (వాక్) అనే నెట్వర్క్ ఫోరంను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ ఫోరం తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కొరకు కలిసి పనిచేస్తుందని సూచించారు

ఈ కార్యక్రమం లో ఫాదర్ కోసి, డాక్టర్ అనిత రెడ్డి, మండల పరిషరాముల, డాక్టర్ నాగవాణి, ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ , నవజీవన్ సంస్థ ప్రతినిధులు కరుణాకర్ ,సంతోష్ కుమార్ తదితరులతోపాటు ఎన్జీవో సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.